సాక్షి
మంచిర్యాల
గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



'పది'లో పట్టు సాధిద్దామిలా..

పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. 8లో▸

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 27న జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలోని అర్హులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలకు 27న, మార్చి 3న కౌంటింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు తెలిపారు. గురువారం పోలింగ్ ముగిసే వరకు నిబంధనలు అమలు చేయాలని అధికారులకు సూచించారు.

గరిష్టం/కనిష్టం
34.0 /19.0


వాతావరణం


ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

ఓటెత్తండి!



పోలింగ్ స్టేషనరీ, ఇతర సామగ్రిని పరిశీలించుకుంటున్న సిబ్బంది





ఉమ్మడి జిల్లా పోలింగ్ కేంద్రాలు			
పట్టభద్రులు	111	టీచర్స్	71

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ఉదయం 8గంటల నుంచి 4గంటల వరకు ఓటింగ్
- సర్వం సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు పెద్దల సభకు తమ ప్రతినిధిని ఎన్నుకునేందుకు అంతా సిద్ధమైంది. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివరాత్రి పండుగ పూట కూడా అధికార యంత్రాంగం విధుల్లోనే ఉంటూ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసింది. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఈ ప్రక్రియపై పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పోలీసు అధికారులు ఎన్నికల నిర్వహణలో భాగంగా పటిష్ట భద్రత, నిరంతర నిఘా ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు, నగదు, మద్యం పంపిణీపై నిఘా వేశారు. బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూంకు



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

చేరే వరకు గట్టి భద్రత ఏర్పాటు చేయనున్నారు.

విద్యావంతులే వెనుకంజ

విద్యావంతులుగా ఉన్న పట్టభద్రులు, టీచర్లే ఓటు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. పలు కారణాలతో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల్లో 50శాతం కూడా ఓటింగ్ నమోదు కాలేదు. మరోవైపు ఓటు వేసే సమయంలో ప్రాధాన్యత క్రమం, అంకె వేయడంలోనూ పొరపాట్లు చేయడంతోనూ ఓట్లు చెల్లకుండా పోతున్నాయి. దీంతో ఓటు వేసినప్పటికీ లెక్కింపులో ఉపయోగం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఓటు ఎలా వేయాలో స్పష్టతతో ఓటింగ్‌కు వెళ్తే నష్టం జరగకుండా ఉంటుందని అధికారులు

2019 ఎన్నికల్లో పోలైన ఓట్లు(నియోజకవర్గ వ్యాప్తంగా)

స్థానం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
పట్టభద్రులు	1,95,581	1,15,359	59.30
ఉపాధ్యాయులు	23,160	19,349	83.54
ప్రస్తుత ఓటర్లు (నియోజకవర్గ వ్యాప్తంగా)			
పట్టభద్రులు	3,55,159	టీచర్లు	27,088

పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులు, సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సాజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

కోరుతున్నారు. ఇక కొందరు తమ పనులు, ప్రయాణాల్లో ఆలస్యంతోనూ సాయంత్రం 4గంటల తర్వాత కేంద్రానికి వచ్చి వెనుదిరుగుతున్నారు. ఈ క్రమంలో ఓటర్లు నిర్దిష్ట సమయంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

పోలింగ్‌కు సిద్ధం

- సిబ్బందికి సామగ్రి పంపిణీ
- పర్యవేక్షించిన కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు అధికారులు అంతా సిద్ధం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో బ్యాలెట్ బాక్సు ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 60మంది, పోలింగ్ అధికారులు 181మంది, సూక్ష్మ పరిశీలకులు 25మంది, పోలీసు సి బ్బంది 250మంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 18, పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 40, కామన్ పోలింగ్ కేంద్రాలు 8 ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీని కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. వేసవి కాలం కావడంతో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, నీడ కోసం టెంట్ల సౌకర్యం కల్పించారు.

భారీ బందోబస్తు

జిల్లాలో ఎన్నికల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రి, ఉద్యోగులను తరలించారు. డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 12మంది సీఐలు, 21మంది ఎస్సైలు, 212మంది ఏ ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటారు. గురువారం పోలింగ్ ముగిసి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూంకు తరలించే వరకు భద్రతను పర్యవేక్షిస్తారు.



ఆలయంలో ఎమ్మెల్యే వివేక్ దంపతుల పూజలు



పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హర హర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన మల్లన్నగట్టు
- జనసంద్రమైన అటవీ ప్రాంతం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- బోనాలు, పట్నాలతో మొక్కులు
- కన్నుల పండువగా మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం
- మల్లన్నను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే, సీపీ

ప్రముఖుల దర్శనం

శివరాత్రి సందర్భంగా గట్టు మల్లన్న స్వామిని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దంపతులు, రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ, దేవాదాయ శాఖ అధికారులు వారిని శాలువాలతో సన్మానించారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలు ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

జైపూర్: మండలంలోని వేలాల మల్లన్న జాతరకు భక్తజనం పోటెత్తింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వేలాల పులకించిపోయింది. అటవీ ప్రాంతంలోని గట్టు మల్లన్న సన్నిధి జనసంద్రమైంది. శివనామస్మరణతో మార్మోగింది. మండలంలోని వేలాలలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్వహించిన మల్లన్నస్వామి జాతర వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్‌భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్, నిజామాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని సిరోంచ, గడ్చిరోలి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సమీపంలోని పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో గట్టు మల్లన్నస్వామి సన్నిధికి చేరుకున్నారు. ఈ ఏడాది సమ్మక్క-సారక్క జాతర లేకపోవడంతో భారీగా పోటెత్తారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగి స్వామి దర్శనానికి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. దివ్య దర్శనానికి భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు బారులు తీరారు. దొణలో స్వయంభూగా వెలిసిన మల్లస్వామి(శివలింగం)ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, లయబద్ధ నృత్యాలు, లక్ష్మీదేవరుల ప్రదర్శనలు, ఒగ్గు పూజారుల డమరుకం మోతలతో వేలాల గట్టు దద్దరిల్లింది. ఉపవాస దీక్షలతో మల్లన్నస్వామికి బోనాలు పోసి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. కుటుంబ సభ్యులతో కలిసి రాత్రంతా జాగారం చేశారు. రాత్రి ఏడు గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో 600మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. 50పైగా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల నిఘా ఉంచారు.

ఊట చెలిమె నీరే తీర్థం

ఎత్తయిన గుట్టపై ఉన్న దొణలో శివలింగం ఉండి పక్కనే ఊట చెలిమె ఉంటుంది. అన్ని కాలాల్లోనూ ఈ చెలిమెలో నీరు ఉంటుంది. మల్లస్వామిని దర్శించుకున్న భక్తులు చెలిమె నీటిని భోజనంలో పోసుకోవడం, మీద చల్లుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చెలిమె నీటినే తీర్థంగా తీసుకుంటే శుభాలు కలుగుతాయని, సంతానం కలుగుతుందని, పొలాల్లో చల్లుకోవడం వల్ల పంటలు బాగా పండుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

బస్సుల రాకపోకలపై ఆరా



నీటిని పంపిణీ చేస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో వేలాల జాతర ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ బుధవారం పరిశీలించారు. వేలాలకు వెళ్లే బస్సుల రాకపోకలపై ఆరా తీశారు. గ్రాండ్ హెల్త్ క్యాంపు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంచినీటి పంపిణీని ప్రారంభించారు. భక్తులకు ఇక్కట్లు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. డీఎం జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, వెల్ఫేర్ బోర్డు సభ్యులు సత్తయ్య, మంగ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గలో ఎంపీ ప్రత్యేక పూజలు

బెల్లంపల్లిరూరల్/శ్రీరాంపూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయం తరఫున ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో లింగాన్ని దర్శించుకుని అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణ కాలనీలో ఉన్న శివాలయాన్ని ఎంపీ సందర్శించారు. శివలింగాన్ని దర్శించుకుని అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మారుతి, అధ్యక్షుడు కొల్లూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బోరే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



శివలింగానికి సీపీ, డీసీపీ, పోలీసుల పూజలు

పింఛన్ అందేనా..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న అక్కాచెల్లెలు ఏల్పుల స్రవంతి, రజిత. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన వీరు మూగవారు. వీరిద్దరూ ఆసరా పింఛన్ కోసం రెండేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నారు. సదరం సర్టిఫికెట్ ఉన్నా ఇంతవరకు ఆసరా పింఛన్ మంజూరు కాలేదు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

జిల్లాలో పింఛన్ల వివరాలు	
వద్ధాప్య	38,357
వితంతువులు	39,905
వికలాంగులు	11,926
చేనేత	281
గీత కార్మికులు	206
ఒంటరి మహిళలు	2502
బీడి కార్మికులు	2348
బోదకాలు	272
మూత్రపిండ వ్యాధిగ్రస్తులు	68
బీడి టేకేదార్	15
మొత్తం	96,582

- మూడేళ్లుగా అర్జీదారుల ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో వితంతువులు, దివ్యాంగులు

నెన్నెల: జిల్లాలో వేలాది మంది అర్హులు ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 2022 ఆగస్టుకు ముందే అర్జీలు సమర్పించినా ఇప్పటివరకు ఆసరా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హతలు ఉన్నా లబ్ధి చేకూరడం లేదని వాపోతున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారికీ నిరాశే మిగిలింది. 2022లో అప్పటి ప్రభుత్వం పింఛన్ అర్హత వయస్సును 65ఏళ్ల నుంచి 57ఏళ్లకు కుదించింది. దీంతో దరఖాస్తుదారుల సంఖ్య భారీగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 18వేలకు పైగా మంది దరఖాస్తులు సమర్పించారు. వీరిలో వితంతువులు, వికలాంగుల దరఖాస్తులు 15వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వితంతువులు కొత్త పింఛన్ కోసం ఎదురు చూస్తుండగా.. రెండేళ్ల క్రితం దరఖాస్తు



నెన్నెల పోస్టాఫీస్ వద్ద పింఛన్ల కోసం వితంతువులు

చేసుకున్న వారి వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. కాగా, జిల్లాలోని 96,582 మందికి ప్రతీ నెల రూ.22.76కోట్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

స్పౌజ్ పింఛన్లు మంజూరు

ప్రస్తుతం స్పౌజ్ కేసుల పింఛన్లు కొనసాగుతున్నాయి. పింఛన్ పొందుతున్న భర్త, భార్య మరణిస్తే ఆ పింఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. గత ఏడాది నుంచి ఈ విధానం కొనసాగుతోంది. అర్హులు దరఖాస్తు చేసుకుంటే రెండు నెలల్లో పింఛన్ బదిలీ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు వేల స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. వితంతు, వికలాంగుల పింఛన్లు కూడా మంజూరు చేయాలని కోరుతున్నారు. పింఛన్ల మంజూరు విషయమై డీఆర్‌డీవో కిషన్‌ను సంప్రదించగా.. కొత్త పింఛన్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని, అర్హులు దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరవుతాయని తెలిపారు.

రెండేళ్ల కిందటే దరఖాస్తు చేసుకున్న



నా భర్త ముస్కె శ్రీనివాస్ రెండేళ్ల కిందట చనిపోయారు. అప్పుడే పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటి వరకు మంజూరు కాలేదు. కూలీ పని చేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– ముస్కె పోశక్క, నెన్నెల

క్లుప్తంగా

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ



బాధితురాలు సుప్రియ

ముధోల్: మహిళ మెడలోంచి గొలుసు అపహరించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల మేరకు బోడగట్టువాడకు చెందిన సుంకరి సుప్రియ బుధవారం ఇంటి ముందు బీడీలు చుడుతూ కూర్చుంది. ద్విచక్ర వాహనం ఫోన్‌లో మాట్లాడుతూ వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ మల్లేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడకు చెందిన అన్నెల లక్ష్మణ్ (50) ఈనెల 21న అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. బుధవారం తెల్లవారుజామున ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మదన్ పేర్కొన్నారు.

ఎల్వీలో పట్టపగలే చోరీ

తానూరు: మండలంలోని ఎల్వీలో అవదుత్ వార్ పెద్దలింగన్న ఇంట్లో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు లింగన్నతో పాటు అతని భార్య అనుషాబాయి ఉదయం పంటచేలకు వెళ్లగా దివ్యాంగుడైన కృష్ణ ఇంటివద్దే ఉన్నాడు. మధ్యాహ్నం ఇంట్లో పడుకుని ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి కృష్ణ మూతికి గుడ్డపెట్టడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో ఇంట్లో ఉన్న రూ.40 వేల నగదుతో పాటు మూడున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల సమాచారంతో ఎస్సై శ్రీనివాస్ క్లూస్ టీంతో తనిఖీ నిర్వహించారు.

టాటా మ్యాజిక్‌లో మంటలు



బూర్గుపల్లి వద్ద దగ్ధమవుతున్న వాహనం

భీమారం: మహాశివరాత్రి సందర్భంగా కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 12 మంది భక్తులు టాటా మ్యాజిక్‌లో కాళేశ్వరం బయలుదేరారు. మార్గమధ్యలో భీమారం మండలంలోని బూర్గుపల్లి సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు అప్రమత్తమై కిందకు దిగిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేసినా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

‘పది’లో పట్టు సాధిద్దామిలా..

- ప్రణాళికతో చదివితేనే ఫలితం
- ఉత్తమంగా రాణించడం తథ్యం అంటున్న విషయ నిపుణులు

పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల వారీగా ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చని విషయ నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకు వారి సలహాలు, సూచనలు వారి మాటల్లోనే..

– లక్ష్మణచాంద



నిర్మల్ జిల్లాలోని వద్యాల్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు

తెలుగు సబ్జెక్టులో..



కొండూరు పోతన్న

తెలుగు పరీక్షకు సన్నద్ధమయ్యే సమయంలో ఈ కింది సూచనలు పాటించాలని నిర్మల్ జిల్లా న్యూవెల్మల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొండూరు పోతన్న తెలిపారు.

- అవగాహన ప్రతిస్పందనకు సంబంధించిన పేరాను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్న తర్వాత ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి.
- దానశీలము, వీర తెలంగాణ, భిక్ష పాఠ్యాంశాల్లో ఉన్న చుక్క గుర్తు గల తొమ్మిది పద్యాలను కంఠస్థం చేసుకోవాలి. ప్రతిపదార్థం కూడా నేర్చుకోవాలి.
- అపరిచిత గద్యము లేదా పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయమనడం లేదా ప్రశ్నలు తయారు చేయమనడం లేదా కీలక పదాల గుర్తింపు ఖాళీల పూరణ వంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిపైన కూడా అవగాహన ఉండాలి
- కవి లేదా రచయిత పరిచయం తప్పకుండా వస్తుంది. కావున పద్యభాగంలో ఆరు పాఠాలు, గద్యభాగంలో ఆరు పాఠాలున్నాయి. కాబట్టి అన్ని పాఠ్యభాగాల కవి, రచయితల పరిచయాలు నేర్చుకోవాలి.
- వ్యాసరూప సమాధాన ప్రశ్నల కోసం పాఠ్యభాగాలకు సంబంధించిన సారాంశాలపై పూర్తి అవగాహన ఉండాలి. ఉపవాచకం నుంచి తప్పకుండా ఒక పేరాగ్రాఫ్, ఇందుకు సంబంధించిన ఒక ప్రశ్న వస్తుంది. దీనిపై కూడా పట్టు సాధించాలి.
- పదజాలంలో అర్థాలు, నానార్థాలు పర్యాయపదాలు, ప్రకృతి, వికృతి, వ్యుత్పత్తి అర్థాలపై పట్టు పెంచుకోవాలి. వ్యాకరణాంశాల్లో సవర్ణదీర్ఘ సంధి, గుణసంధి, వృద్ధిసంధి, యణాదేశ సంధులతో పాటు తెలుగు సంధులు, సమాసాలు, అలంకారాలు, చందస్సులపై అవగాహన కలిగి ఉండాలి. ఇలా చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చు.

హిందీ



అరుణ

ప్రశ్నపత్రాన్ని రెండు మూడుసార్లు చదివి అర్థం చేసుకున్న తర్వాత సమాధానాలు రాస్తే అధికమార్కులు సాధించవచ్చని సూచిస్తున్నారు నిర్మల్ జిల్లా కొట్ల(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు అరుణ.

- పదోతరగతి విద్యార్థులకు ద్వితీయ భాష హిందీ 80 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. అందులో ఫస్ట్‌బిట్‌లో పేరాగ్రాఫ్‌లు ఇచ్చి ప్రశ్నలు అడుగుతారు. పేరాగ్రాఫ్‌ను రెండు మూడుసార్లు చదివిన తర్వాత ఐదు ప్రశ్నలకు ఐదు జవాబులు రాయాలి.
- పద్యభాగం నుంచి ఒకటి, గద్యభాగం నుంచి ఒకటి జనరల్ పేరాగ్రాఫ్ ఇస్తారు. ఇందులో కూడా ఐదు ప్రశ్నలు అడుగుతారు. ఐదు ప్రశ్నలకు 10 మార్కులు ఇస్తారు. మొత్తం కలిపి 20 మార్కులు ఉంటాయి. పేరాగ్రాఫ్ కానీ పద్యాలు గాని చక్కగా చదివి తగిన జవాబు రాయాలి.
- జనరల్ పేరాగ్రాఫ్‌లో పేరాగ్రాఫ్‌కు సంబంధించిన టైటిల్ రాయమని అడుగుతారు. కాబట్టి పేరాగ్రాఫ్‌ను బాగా చదివి ఏ విషయం గురించి ఎక్కువ చెప్పాడో అర్థం చేసుకుని జవాబు రాయాలి.
- రెండోబిట్టులో నాలుగు మార్కులకు సంబంధించిన నాలుగు ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ముఖ్యమైనది కవి పరిచయం. కవి పూర్తి పేరు, పుట్టుక, మరణం, ముఖ్యమైన గ్రంథం , అతనికి వచ్చిన అవార్డులు కచ్చితంగా రాయాలి. మిగిలిన మూడు ప్రశ్నలు గద్య భాగం, పద్యభాగం నుంచి ఇస్తారు.
- మూడవ బిట్టులో 8 మార్కులకు సంబంధించి ఆరు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రతీ ప్రశ్నకు చాయిస్ ఉంటుంది. ఇందులో మనం రాయాల్సినవి మూడు ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే. ఇందులో పద్య భాగానికి సంబంధించి ఒకటి, గద్యభాగానికి సంబంధించి ఒక ప్రశ్నకు సమాధానం రాయాలి. మూడవ ప్రశ్నలో లెటర్ రైటింగ్, పోస్టర్ సంభాషణ, ఇన్విటేషన్ డైరీ, నిబంధన వ్యాసం లాంటి ప్రశ్నలు ఇస్తారు. ఇందులో ఏ టాపిక్‌పై వ్యాసం రాయమంటే దానిపై రాయాలి. పోస్టర్ కలర్స్‌తో పెన్సిల్ ఉపయోగించి చాలా చక్కగా గీయాలి.
- సంభాషణ కూడా ఇద్దరి మధ్య జరుగుతున్నట్టుగా చక్కగా బాక్స్ గీసి అందులో రాయాలి. ఇన్విటేషన్‌ను కూడా ఒక బాక్స్‌లాగా చేసి అందులో రాయాలి. ఈ విధంగా ఈ మూడు ప్రశ్నలను చక్కగా చేయాలి. ఇవి 8 మార్కులకు సంబంధించిన లాంగ్ ప్రశ్నలు కాబట్టి తప్పకుండా ఇందులో ముఖ్యమైన పాయింట్స్ కింద అండర్‌లైన్ చేసి, ఇన్వెటెడ్ కామాలు పెట్టాలి.
- పార్ట్ బీలో 20 మార్కులకు 20 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో బాగా చదివితే 19 మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది. రెండు ప్రశ్నలు తప్పు చేస్తే 18 మార్కులు వస్తాయి. ఇలా ఎన్ని ప్రశ్నలు తప్పయితే అన్ని మార్కులు తగ్గుతూ ఉంటాయి.
- పార్ట్ బీలో వ్యాకరణానికి సంబంధించిన, పుస్తకంలో ఉన్న పాఠాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. కింద చాయిస్ ఇవ్వబడుతుంది.
- పైన ఇచ్చిన ప్రశ్నలను చక్కగా చదివి ఏ,బీ,సీ,డీ అని చాయిస్‌లో ఏదైతే దానికి సంబంధించి ఉంటుందో సరైన సమాధానం రాయాలి. కొట్టివేతలు, ఓవర్ రైటింగ్ చేయకూడదు.

ఆంగ్లం



ఆదిల్

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఆంగ్లంలో మంచి మార్కులు సాధించవచ్చని అంటున్నారు నిర్మల్ జిల్లా పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆదిల్.

పార్ట్ (ఏ)లో...

- రీడింగ్ కాంప్రహెన్సనల్ పాసేజ్‌లను బాగా చదివి అర్థం చేసుకోవాలి.
- ఇచ్చిన ప్రశ్నలకు డైరెక్టు, ఇన్‌డైరెక్టు, రిఫ్లెక్టీవ్ అనలిటికల్ సమాధానాలు రాయాలి.
- స్టడీస్కిల్స్‌లో పైచార్టు, బార్‌గ్రాఫ్, ట్రీఫ్లోచార్టు లాంటివి అడుగుతారు. ఇందులో ముఖ్యంగా చార్ట్ అనగానేమి? చార్టులు ఎన్నిరకాలు? ఏవి ఎక్కువగా ఇష్టం? వంటి ప్రశ్నలు ఉంటాయి. ఇవి చాలా సులభం.
- గ్రామర్‌లో చాలా ముఖ్యమైనవి డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, క్వశ్చన్ ట్యాగ్, వాయిసెస్, రిపోర్టెడ్ స్పీచ్, సింథసిస్, కండీషనల్‌పై ప్రశ్నలు వస్తాయి. వాటిని బాగా ప్రాక్టీస్ చేయాలి.
- మైనర్ డిస్‌కోర్సెస్‌లో పోస్టర్, ప్రొఫైల్ మెసేజ్, నోటీస్, డైరీ, ఇన్విటేషన్ వంటి ప్రశ్నలు వస్తాయి. ఇందులో ముఖ్యమైన అవుట్‌లైన్, డేట్, ఈవెంట్, వెన్యూ, టైమ్, ఇష్యూడ్‌పై విధిగా రాయాలి.
- మేజర్ డిస్‌కోర్సెస్‌లో డిస్క్రిప్షన్, లెటర్ రైటింగ్, ఇంటర్వ్యూ, కొరియోగ్రఫీ, ఎస్సే, బయోగ్రఫీ వంటివి ముఖ్యమైనవి. వీటి ద్వారా మంచి మార్కులు సాధించవచ్చు.

పార్ట్ (బీ)లో...

- అన్‌సీన్ పోయం ఇస్తారు. దీనిని చదివి మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- ఎడిటింగ్‌పార్ట్‌లో రీడింగ్ ఏ నుండి ప్రశ్నలు వస్తాయి. వర్బ్‌ఫామ్స్, ఆర్టికల్స్,అపోజిట్‌వర్డ్స్, సినానిమ్స్, కంజక్షన్స్, ప్రొనౌన్స్‌పై దృష్టి సారించాలి.
- డైరెక్ట్ ప్రశ్నలకు ఇచ్చిన పాసేజ్‌లో అండర్‌లైన్ చేసిన వాటికి సరైన పదాలు, రీప్లేస్ ద అండర్ లైన్ వర్డ్, ఆంటోనిమ్స్, సిననిమ్స్ అడుగుతారు.

తొడసం కైలాస్‌కు సన్మానం

కైలాస్‌నగర్: మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధానీ నరేంద్రమోదీతో ప్రశంసలు అందుకున్న ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ దంపతులను కలెక్టర్ రాజర్షి షా బుధవారం సన్మానించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గిరిజన భాషల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. సాంఘికశాస్త్రం బోధించే సదరు ఉపాధ్యాయుడు కృత్రిమ మేధస్సు(ఏఐ)తో గోండి , కొలాం గిరిజన భాషల్లో పాఠాలను రూపొందించిన విషయం తెలిసిందే. కాగా కలెక్టర్‌పై తెలుగులో పాట రాసి మ్యూజిక్‌ను అందించి రిలీజ్ చేసినట్లుగా కైలాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత, ఉపాధ్యాయులు అజయ్, రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



కైలాస్ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్

గోదావరిలో మునిగి ఒకరి గల్లంతు



రాజేశ్ (ఫైల్)

కోటపల్లి(చెన్నూర్): మహాశివరాత్రిని పురస్కరించుకుని పుణ్యస్నానం ఆచరించేందుకు గోదావరికి వెళ్లిన వ్యక్తి నదిలో గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పార్‌పల్లి గ్రామానికి చెందిన రాదండి రాజేశ్ (46) బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యస్నానం ఆచరించేందుకు గోదావరినదికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా రాజేశ్ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని ఎర్రాయిపేట గ్రామ గజ ఈతగాళ్లతో గోదావరిలో పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు ఎస్సై తెలిపారు. గల్లంతైన రాజేశ్‌కోసం భార్య రేవతి, కూతురు శివనందిని, కుమారుడు సంతు రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రోదిస్తున్న రాజేశ్ భార్య, పిల్లలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇంద్రవెల్లి: ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మడావి రాంషావ్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఉట్నూర్ మండలానికి చెందిన దేవల్లా శ్రీనివాస్ బైక్‌పై ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా కెస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన మడావి రాంషావ్ బైక్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు. మృతికి కారకుడైన దేవల్లా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోడ కూలి ఒకరు..



సంద్ర రవి (ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిర్రకుంటలో మంగళవారం రాత్రి గోడ కూలిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన సంద్ర రవి (48), సంద్ర ఎల్ల య్య ఇంటివద్ద భూమి విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రవి భూమిలో ఉన్న వేప చెట్టు వల్లనే తన బాత్‌రూం గోడలు పగులుతున్నాయని ఎల్లయ్య తిట్టుకుంటూ బయటకు వచ్చాడు. అదే సమయంలో అక్కడే ఉన్న రవి ఎందుకు తిడుతున్నావని ప్రశ్నిస్తుండగానే కాలితో బాత్‌రూం గోడను తన్నడంతో అతనిపై కూలింది. కుటుంబ సభ్యులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఎల్లయ్యను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మరొకరు..

మందమర్రిరూరల్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు మందమర్రి పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన వేల్పుల సురేందర్ (33)కు మూడేళ్ల క్రితం గుండెకు సర్జరీ జరిగింది. మంగళవారం అతని భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం గేటు లోపల అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కవ్వాల్ పక్షి మహోత్సవం విజయవంతం చేయాలి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించనున్న కవ్వాల్ పక్షి మహోత్సవం (బర్డ్ ఫెస్టివల్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ, డబ్ల్యూడబ్ల్యూ ఎఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్, గోదావరి పరీవాహక ప్రాంత పక్షి వైవిధ్య సంరక్షణ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. పక్షి ప్రేమికులు, పరిశోధకులు, స్థానిక సమాజాన్ని ఒకచోట చేర్చి వాటి ప్రత్యేకతలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రముఖ పక్షి శాస్త్రవేత్తల నిపుణుల ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీశాఖ సిబ్బందికి ఇయర్లీ బర్డ్ కౌంట్ ఇండియా, ఐఐఎస్ఈఆర్ తిరుపతి, రౌండ్ గ్లాస్ స్టేషన్, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్, మంచిర్యాల అటవీశాఖ నిపుణుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పక్షుల సంరక్షణపై అవగాహన పెంచుకునేందుకు స్థానిక ప్రజలు, విద్యార్థులు, పక్షి ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ కోరారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

కడెం: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాత మద్దిపడగకు చెందిన బాతెం నర్సయ్య (67)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అతని భార్య రాజును మద్యానికి డబ్బులు ఇవ్వమని అడుగగా లేవని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

తలమడుగు: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన జువాక పవన్ కుమార్ (27) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకులో క్రెడిట్ కార్డ్ ఉద్యోగం చేస్తున్నాడు. నిత్యం మద్యం సేవించే అలవాటున్న పవన్‌కుమార్ బంధువుల ఇంట్లో శుభకార్యం ఉందని సోమవారం ఆదిలాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం తండ్రి నర్సింగ్ పంట పొలానికి వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి(బెల్లంపల్లి): వేమనపల్లి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన బియ్యం పక్కదారి పట్టడం, పాఠశాలలో అంతర్గత విషయాల్లో పొరపాట్లకు బాధ్యుడైన హెచ్‌ఎం సస్పెండ్ అయ్యారు. ఆశ్రమ పాఠశాల బియ్యం పక్కదారి శీర్షికన ఈ నెల 16న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం మేరకు విచారణ జరిపి హెచ్‌ఎం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆదేశాలు జారీ చేశారు. మంచిర్యాల బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన మాధవ్‌ను వేమనపల్లి పాఠశాల హెచ్‌ఎంగా నియమిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ నెల 15న వేమనపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన బియ్యం 28 క్వింటాళ్లు కోటపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి తరలిస్తున్నట్లు (ఆర్వో)లో పేర్కొని ప్రైవేట్ వాహనంలో 18 క్వింటాళ్లు మాత్రమే పంపించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందగా తహసీల్దార్, ఆర్‌ఐ విచారణ జరపగా ఎంఎల్‌ఎస్ పాయింట్ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది కుమ్మక్కై బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరిగినట్లు వెల్లడైంది. ఈ విషయమై ‘సాక్షి’లో ప్రచురితం కాగా ఐటీడీఏ, డీటీడబ్ల్యూవో పలుమార్లు విచారణ జరిపారు. విచారణకు వెళ్లిన అధికారులకు బియ్యం అక్రమాలతో పాటు హెచ్‌ఎం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తన సొంత పనులకు వెళ్లడం, స్టోర్ రూమ్‌లో పాత సరుకులు ఉంచడం, మరుగుదొడ్ల శుభ్రత పాటించకపోవడంపై సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

బోథ్: సొనాల మండలంలోని టివిటి గ్రామం మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సొనాలకు చెందిన పోశెట్టి, ఇసాక్ బైక్‌పై వెళ్తుండగా టివిటి గ్రామ మూలమలుపు వద్ద మహారాష్ట్రకు చెందిన మరో వ్యక్తి బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. దీంతో పోశెట్టి, ఇసాక్‌కు తీవ్ర గాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు.

బాసరలో మహాశివరాత్రి వేడుకలు



బాసర గోదావరినదిలో భక్తుల పుణ్యస్నానాలు

బాసర: మహాశివరాత్రిని పురస్కరించుకుని బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో కొలువుదీరిన శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున గోదావరిలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు గంగమ్మతల్లికి దీపారాధన, పుష్పార్చన చేశారు. అనంతరం నదీ తీరాన ఉన్న సూర్యేశ్వర, పాపహరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరహర మహాదేవ.. శంభో శంకర శివనామస్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. సాయంత్రం మహాలింగార్చన, గోదావరినది దీపాల ప్రజ్వలన ఉంటుందని అర్చకులు తెలిపారు.



సూర్యేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

భీమేశుని చేతిలో లింగేశ్వరుని ప్రతిమ

- మట్టితో మహాశివుని మలిచిన కళాకారుడు

నిర్మల్‌ఖిల్లా: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లాకు చెందిన యువ కళాకారుడు పోలీస్ భీమేశ్ గరళకంఠుని రూపాన్ని మట్టితో తీర్చిదిద్దాడు. నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన భీమేశ్ తనకున్న అభిరుచితో మట్టితో వివిధ రకాల ప్రతిమలను తయారుచేస్తుంటాడు. దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలికినప్పుడు ఏర్పడిన గరళాన్ని సేవించి తన కంఠంలో ఉంచిన దృశ్యాలను ఉట్టిపడేలా దాదాపు రెండు అడుగుల పొడవున్న ఈ శివుని విగ్రహాన్ని రూపొందించాడు. పర్యావరణానికి హాని కలగని రీతిలో చెరువులో దొరికే సాధారణ బంకమట్టితో పాటు సహజసిద్ధ రంగులను వినియోగించినట్లు ఆయన పేర్కొన్నాడు. మహాశివరాత్రి రోజున భక్తజనం భోళాశంకరుని నామస్మరణం చేస్తూ పులకించిపోతారు. ఈ నేపథ్యంలో తన కళ ద్వారా ప్రత్యేకతను చాటి శంకరుని మట్టిరూపాన్ని తీర్చిదిద్దిన తీరును పలువురు అభినందిస్తున్నారు.



భీమేశ్ రూపొందించిన గరళకంఠుని విగ్రహం

వేర్వేరు చోట్ల భారీగా మద్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెంలో బుధవారం భారీ మొత్తంలో మద్యం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్సై మధుకర్, చింతలమానెపల్లి ఎస్సై నరేశ్, బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ శ్రీనిధి వైన్ షాపు పక్కనే ఉన్న గదిలో నిల్వ ఉంచిన రూ.20,24,160 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కోడిపక సత్యనారాయణ, కంపరి అంజన్నపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామంలో రామగిరి శంకర్ వద్ద రూ.98,400, కుశతురివారి ఆకాశ్ వద్ద రూ.19,200, సంతోష్ జైస్వాల్ వద్ద రూ.9,130 విలువైన మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గూడెం మొత్తంలో రూ.21,50,890 విలువైన మద్యం ను పట్టుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం

బెల్టుషాపులపై దాడులు

చింతలమానెపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి మద్యం సీజ్ చేసినట్లు అబ్కారీశాఖ సీఐ రవి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు లోభానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రామానికి చెందిన గోస్కుల పోశెట్టి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 218 లీటర్ల మద్యాన్ని మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.94,776 ఉంటుందన్నారు. దాడిలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద బుధవారం మహారాష్ట్ర నుంచి తెలంగాణకు తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ప్రవీణ్, నరేష్ బైక్‌పై రూ.14,400ల మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు.